# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 12-03-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ దేశీయ ఉత్పత్తుల వినియోగం పెంచి, విదేశీ వస్తు వినియోగం తగ్గించడమే వన్ స్టేషన్ - వన్ ప్రోడక్ట్ ముఖ్య ఉద్దేశ్యమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలియజేశారు.

- ❖ రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయని ముఖ్యమంత్రి వై ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు.

- ❖ ఉపాధ్యాయుల నియామకం కోసం నిర్వహించే డీఎస్సీ పరీక్షలు ఈ నెల 30 వ తేదీన ప్రారంభమవుతాయని విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు.

- ❖ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర ఆకాంక్షించారు.

===================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు 85 వేల కోట్ల రూపాయలు రైల్వే అభివృద్ధి పనులను వర్చువల్‌గా ప్రారంభించారు. గుజరాత్ లోని అహమ్మదాబాద్ నుండి జరిగిన ఈ కార్యక్రమం సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ… వికసిత్ భారత్ - నవ నిర్మాణ్ లలో భాగంగా రైల్వే వ్యవస్థ ఆధునీకరణకు పనులకు సుమారు 11 లక్షల కోట్ల రూపాయలు కేటాయించడం జరిగిందన్నారు. స్వదేశీ ఉత్పత్తుల వినియోగం పెరిగి, విదేశీ వస్తు వినియోగం తగ్గించడమే వన్ స్టేషన్ - వన్ ప్రోడక్ట్ ముఖ్య ఉద్దేశ్యమని, స్వదేశీ వస్తువుల వినియోగం వల్ల ఆరోగ్యకరమైన భారత్ ను చూడవచ్చని పేర్కొన్నారు. వస్తు వినియోగం పెరగాలంటే, కొనుగోలు శక్తి పెరగాలని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాల పైన ఉందని ప్రధాని వ్యాఖ్యానించారు. గడచిన పది సంవత్సరాలలో భారత రైల్వే వ్యవస్థని ప్రపంచస్థాయికి తీసుకువెళ్లడం ఎంతో ఆనందకరంగా ఉందని పేర్కొంటూ….

(వాయిస్ 30 సెకన్లు)

===================

ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డి ఈరోజు విజయవాడలో పలు అభివద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. నగరంలోని కనకదుర్గ వారధి వద్ద ఇరిగేషన్ రిటైనింగ్ వాల్, కృష్ణా రివర్ ఫ్రంట్ సుందరీకరణ ఫేజ్–1 పనులతో పాటు వివిధ ప్రాంతాల్లో సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ల నిర్మాణ పనులకు ఆయన శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.... విజయవాడలో 31 వేల 866 ఇళ్ళ పట్టాలను రెగ్యులరైజ్ చేసి సంపూర్ణ హక్కులతో ప్రజలకు అందజేస్తున్నట్టు తెలిపారు. అదేవిధంగా నిరభ్యంతర భూముల్లో ఉన్న 9 వేల 125 పట్టాలను రెగ్యులరైజ్ చేయడం జరుగుతోందని వివరించారు. ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టుకు వెళ్ళేందుకు కేవలం 58 నెలల కాలంలోనే పెండింగ్ లో ఉన్న ఫ్లై ఓవర్ పూర్తి చేయడంతో పాటు అదే మార్గంలో మరో రెండు ఫ్లై ఓవర్ల నిర్మాణం జరిగిందని వివరించారు. అభివృద్ధి కార్యక్రమాలను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయడం గత నాలుగేళ్ళలో మాత్రమే జరిగిందని పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో డిఎస్సీ - 2024 పరీక్షల షెడ్యూల్ లో మార్పులు చేసినట్లు విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన చేస్తూ... ఈ నెల 15 వ తేదీ నుంచి ప్రారంభం కావాల్సిన డిఎస్సీ పరీక్షలు మార్చి 30 వ తేదీ నుంచి ఏప్రిల్ 30 వరకు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. 6100 మంది ఉపాధ్యాయుల నియామకం కోసం జరగనున్న ఈ పరీక్షను మొత్తం 14 రోజుల పాటు రెండు సెషన్స్ లో నిర్వహించేలా టైం టేబుల్ను రూపొందించినట్టు వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = =

మహిళల ఆర్థిక స్వావలంబన ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. ఈరోజు పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు టౌన్ లో నిర్వహించిన వైఎస్ఆర్ చేయూత నాల్గవ విడత వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహిళల ఆర్థిక స్వావలంబనే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని, మహిళలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని తెలిపారు. మహిళలు సంక్షేమ పథకాలను వినియోగించుకొని ఆర్థికంగా ఎదగాలని ఆయన కోరారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

జిల్లాలో ఖరీఫ్ 2023-24 సంబంధించిన ధాన్యం కొనుగోలు ప్రక్రియ రేపటితో ముగుస్తుందని విశాఖ జిల్లా సంయుక్త కలెక్టర్ కె. మయూర్ అశోక్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన చేస్తూ రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరకు ధాన్యం సేకరణ జరుగుతుందని, 10 రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోళ్లు చేపడుతున్నామని జేసీ వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో వర్చువల్ విధానంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ ముఖాముఖి నిర్వహించనున్నట్టు తిరుపతి జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. ప్రధాని కార్యక్రమానికి సంబంధించిన సమీక్షా సమావేశాన్ని ఈరోజు ఆయన... కేంద్ర సామాజిక న్యాయ, సాధికార మంత్రిత్వ శాఖ ప్రతినిధి రాజేష్ కుమార్ మక్కర్, సంబంధిత అధికారులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఈ నెల 13వ తేదీన సాయంత్రం 4 గంటలకు ప్రధాని నిర్వహించే ముఖాముఖి కార్యక్రమంలో బీసీ, ఎస్సీ, సఫాయి కరంచారి లబ్ధిదారులు హాజరు కావాలని సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = =

సరైన అనుమతులు లేకుండా తుపాకులను కలిగిఉన్న వారు వాటిని వారం రోజుల గడువులోగా సమీప పోలీస్ స్టేషన్ లో అప్పగించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా సూచించారు. ఈరోజు పాడేరులో జరిగిన పత్రికా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తుపాకులను విక్రయించడం, కొనడం, పరీక్షించడం, కలిగి ఉండడం మొదలైన వాటిని నేరాలుగా పరిగణిస్తామన్నారు. గడువు ముగిశాక, పోలీసులు చేపట్టే తనిఖీలలో ఎవరివద్దనైనా అనుమతులు లేని తుపాకులు పట్టుబడితే జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు.

= = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు వర్చువల్‌గా ప్రారంభించిన రైల్వే అభివృద్ధి పనుల్లో భాగంగా రాష్ట్రంలోని పలు రైల్వే స్టేషన్లలో జరిగిన కార్యక్రమాలలో స్థానిక నేతలు, అధికారులు పాల్గొన్నారు. విశాఖకు సంబంధించి కొత్తవలస - కోరాపుట్ సెక్షన్లు & కోరాపుట్ - రాయగడ లైన్లలో రెండు డబ్లింగ్ ప్రాజెక్టులు, విజయనగరం -టిట్లాగఢ్ థర్డ్ లైన్ ప్రాజెక్ట్‌లో పూర్తి చేసిన భాగాలను, గూడ్స్ షెడ్, వాల్తేర్ డివిజన్ లో ఏడు చోట్ల వన్ స్టేషన్ వన్ ప్రొడక్ట్ స్టాల్స్ ను ప్రధాని ప్రారంభించారు. విశాఖ నుండి భువనేశ్వర్‌కు కొత్త వందేభారత్ రైలును ప్రధాని ప్రారంభించారు.

= = = = = = = = = = = = = = = = = = =

ఎన్నికల నిబంధనల పట్ల అవగాహన కలిగి ఉండాలని పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ ఎస్ శోభిక అన్నారు. ఈరోజు ఆమె పార్వతీపురంలో జరిగిన ఎన్నికల అవగాహనా సదస్సులో మాట్లాడుతూ... ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా జరగాలంటే అధికారులతో పాటు, ప్రజలకు కూడా ఎన్నికల నిబంధనల పట్ల పూర్తి అవగాహన అవసరమని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

గత ఎన్నికల్లో తక్కువ పోలింగ్ నమోదు అయిన కేంద్రాల పరిధిలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ మాధవీలత ఆదేశించారు. ఈరోజు ఆమె రాజానగరం మండలంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి ఒక్క ఓటరు తప్పకుండా పోలింగ్ కేంద్రాలకి వచ్చేలా బూత్ స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని స్పష్టంచేశారు.

= = = = = = = = = = = = = = = = = = =

గిరిపుత్రులకు గుణాత్మకమైన విద్యను అందించాలని సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ITDA ప్రాజెక్టు అధికారి వి. అభిషేక్ అధికారులను ఆదేశించారు. ఈరోజు ఆయన పాడేరులో జరగిన సమావేశంలో మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం 2023 రెగ్యులరైజేషన్ చట్టం 30 ని సమర్ధవంతంగా అమలు చేసి సి ఆర్ టిను రెగ్యులరైజ్ చేసిందన్నారు. విద్యార్థులకు మంచి విద్యను అందించి ఉన్నతంగా తీర్చి దిద్దాలని, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని స్పష్టం చేసారు.

= = = = = = = = = = = = = = = = = = =

తక్కువ ధరకే నాణ్యమైన ఆహారం అందించే విధంగా రాష్ట్ర పర్యాటక శాఖ తిరుమలలో మూడు కొత్త రెస్టారెంట్లను అందుబాటులోకి తీసుకువచ్చింది. పర్యాటక శాఖా మంత్రి ఆర్కే రోజా తిరుమలలోని మూడు ప్రాంతాల్లో హోటల్స్ ను ఈరోజు ప్రారంభించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ... తిరుమలలోని అన్నమయ్య భవన్, బాలాజీ, నారాయణగిరి టూరిజం హోటల్స్ ను... స్టార్ హోటల్ స్థాయిలో రూపురేఖలు మార్చి భక్తులకు అందుబాటులోకి తెచ్చామన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయని రాష్ట్ర విద్యుత్, అటవీ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం చవటకుంటలో పలు అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గతంలో ఎప్పుడూ లేని విధంగా ప్రస్తుత ప్రభుత్వం అభివృద్ధికి, సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ సుపరిపాలన అందిస్తోందని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = =